క్లుప్తంగా

రేపు పైడమ్మతల్లి వార్షిక తిరునాళ్ల

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలో వేంచేసియున్న పైడమ్మతల్లి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 20వ తేదీన జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్లలో భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకోవచ్చన్నారు.

నేడు విఖనసాచార్యస్వామి వార్షిక జయంతి

సత్తెనపల్లి: శ్రావణ పూర్ణిమ పురస్కరించుకుని పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈ నెల 19న విఖనసాచార్య స్వామి వారి వార్షిక జయంతి మహోత్సవం జరుగుతుందని వికనస మండలి సత్తెనపల్లి డివిజన్ బాధ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అష్టదిక్పాలక పూజ, నవగ్రహ పూజ, ఆఘూరం, ఉపాకర్మ హోమం(ముం.విడుపు), విశేష స్నపన, అలంకరణ ఆలయోత్సవం, విశేష పూజ జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా క్రోసూరు మండలం 88 తాళ్ళూరు గ్రామానికి చెందిన పరాశరం తేజ్ సాయి సుదర్శన్, అమరావతి మండలం మల్లాది గ్రామానికి చెందిన పరుచూరి ఇందీవర శ్యామ్‌లకు విద్యార్థి ప్రతిభ పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ధర్మ ప్రచారం



అమరావతి: త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో మంగళవారం మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో శ్రీకృష్ణ భగవానుడి సర్వ మానవాళికి అందించిన సందేశాలు ప్రతి ఒక్కరికి అందేలా ప్రచారం చేస్తున్నామని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి– హిందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకృష్ణుడు ప్రపంచానికి అందించిన జ్ఞాన సంపద అందరికి తెలియపరుచుటకు ప్రతి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి సభ్యులు కృష్ణారావు, శివలింగంనాయక్, శ్రీకాంత్, చంద్రశేఖర్, నాగార్జున, హరిబాబు, చంద్రగౌరి తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభానికి సిద్ధమైన సీతారామాలయం



అచ్చంపేట: మండలంలోని చింతపల్లిలో పవిత్ర కృష్ణానదీ తీరంలో పునర్నిర్మించబడిన సీతారాముల దేవాలయ ప్రారంభోత్సవం సోమవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరుగనుంది. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా స్వామి వారి విగ్రహాల సంప్రోక్షణ, రామ నామ ఏక వర్ణము వంటి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారి దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రారంభోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు వచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పెదకూరపాడు: మండల పరిధిలోని పాటిబండ్ల గ్రామ పొలిమేరలో జూదమాడుతున్న 8 మంది పేకాట రాయుళ్లను పెదకూరపాడు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. తమకు అందిన సమాచారం ప్రకారం పెదకూరపాడు పోలీసులు దాడి చేసి 8 మంది పేకారాయుళ్లను, రూ.6,480 నగదును, రెండు ద్విచక్ర వాహనాలను 5 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు

మాచర్ల: మాచర్ల పట్టణంలోని పాత మాచర్లలో ఆదివారం ఉపవాస ప్రార్థనల్లో భాగంగా మరనాత మందిరంలో పాస్టర్ వై.ఏలిషా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాల్గవ వచనం వివరించి ఏసు ప్రభు వాక్యాలను బోధించారు. ఈ కార్యక్రమంలో ఎం.దానియేల్, బిక్కం అంజి, పి.చెన్నయ్య, నాగమ్మతో పాటు పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు. అదే విధంగా కేసీపీకి వెళ్లే రహదారిలో ఉన్న చర్చిలో పాస్టర్ దానియేల్ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాత మాచర్లలో 25వ వార్డులో బేతేల్ మందిరంలో పాస్టర్ జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు, ఉపవాస ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు.

బీమా.. ఏది ధీమా..!?

- పంటల బీమాపై స్పష్టత ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- ఉచిత పంటల బీమా అమలయ్యేనా..?
- ఆందోళన చెందుతున్న రైతులు

బీమా అంటేనే రక్షణ. కష్ట కాలంలో ఆదుకుంటుందనే నమ్మకం. కానీ ఆ నమ్మకాన్ని వమ్ము చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నదాతలు మండి పడుతున్నారు. పంటల బీమాపై రైతుల్లో సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు.



కట్టమూరు వద్ద నీటి మునిగిన వరి పంట (ఫైల్)

సత్తెనపల్లి: ఆరుగాలం కష్టపడి పండించే అన్నదాతకు అడుగడుగునా అవాంతరాలే. చీడపీడలు, నకిలీ పురుగు మందులు, విత్తనాలు, అతివృష్టి, అనావృష్టి ఇలా ఎన్నో అవరోధాలుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో పంటలు నష్టపోతే ఆయా సీజన్లలో పంట నష్టపరిహారం అందేది. గత ప్రభుత్వ హయాంలో అమలైన పంటల బీమా స్థానంలో రైతులకు మరింత ప్రయోజనం కలిగించేలా మెరుగైన పథకాన్ని తెస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త పథకంపై అధ్యయనానికి ముగ్గురు మంత్రులతో కమిటీ వేయడంతో పాటు నెల రోజుల్లో సదరు కమిటీ నివేదిక ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానించడంతో రైతుల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కమిటీ నెల రోజుల్లో నివేదిక ఇచ్చినా ఉత్తర్వులు ఇచ్చి కార్యాచరణలోకి రావాలంటే మరింత సమయం పడుతుంది. ఉచిత పంటల బీమా అమలు చేస్తుందా లేక మళ్లీ 2019కి ముందు పరిస్థితులే వస్తాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఖరారు కాని విధివిధానాలు

ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల కారణంగా పంటలు నాశనమై రైతు నష్టపోతున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యకు పాల్పడిన సందర్భాలను 2019కి ముందు వరకు చూశాం. ఇలాంటి విపత్తుల నుంచి రైతులను ఆదుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం తీసుకువచ్చింది. ప్రతి ఏడాది పంట వేసినప్పుడే ఈ–క్రాప్ బుకింగ్ చేసి రైతు నష్టపోకుండా జగన్ సర్కార్ అండగా నిలిచింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కొంత మంది రైతులు నాట్లు వేయడంతో పాటు వివిధ రకాల పంటలను సాగు చేశారు. పంట రుణాల రెన్యువల్ ప్రక్రియ కూడా ముగిసింది. సకాలంలో బీమా ప్రీమియం చెల్లించకపోతే ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులు పరిహారం పొందే అవకాశం కోల్పోతారు. అయితే సాధారణంగా రెన్యువల్ సమయంలోనే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. కానీ రెన్యువల్ ముగిసిన తర్వాత కూడా పంటల బీమాపై మంత్రులతో త్రిసభ్య కమిటీ వేసి రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుంది. 2024–25 సంవత్సరానికి సంబంధించి విధివిధానాలను కూటమి ప్రభుత్వం ఖరారు చేయాల్సి ఉంది.

రైతులపై భారం లేకుండా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రైతులపై ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా అమలు చేసింది. కూటమి ప్రభుత్వం కూడా ఉచిత పంటల బీమా అమలు చేస్తుందా..? లేక 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో లాగా ఎకరాకు రూ.525 చొప్పున ప్రీమియం వసూలు చేస్తుందా అని రైతులు ఆందోళనలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరితోపాటు బీమా కింద పత్తి తదితర పంటలకు వాతావరణ బీమా, ఫసల్ బీమా కింద కంది, వరి, మొక్కజొన్న, ఉచిత బీమా కింద రాగి తదితర పంటలకు వర్తింప చేసింది. కూటమి ప్రభుత్వం ఏఏ పంటలకు బీమా వర్తింప చేస్తుందో ప్రకటించాల్సి ఉంది.

గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో రైతులకు ప్రయోజనం ఇలా...

మండలం	లబ్ధి పొందిన రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
సత్తెనపల్లి	4,118	4.62
ముప్పాళ్ళ	4,472	5.83
రాజుపాలెం	4,115	2.88
నకరికల్లు	4,252	3.58

నియోజకవర్గంలో సాగు ఇలా...

నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 33,917 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా.. ప్రస్తుత ఖరీఫ్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా 7,285 హెక్టార్లలో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. రైతులు ఈ–క్రాప్ ఉచిత బీమా కోసం ఎదురుచూస్తున్నారు.

కౌలు రైతులందరికీ పంట రుణాలు అందించేందుకు కృషి



ఎస్.శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు, పంట రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సత్తెనపల్లి మండలంలో 2024–25 సంవత్సరానికి మొత్తం 3,080 సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3,089 సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 2024–25 సంవత్సరానికి గాను కౌలు రైతులకు రుణాలు రూ.9.9 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 145 మందికి రూ.0.9 కోట్లు రుణాలు ఇప్పించడం జరిగిందన్నారు. కౌలు రైతుల జాబితాను ఇప్పటికే బ్యాంకులకు పంపామని, ప్రతి కౌలు రైతును గుర్తించి వ్యక్తిగతంగా, జేఎల్‌జీ గ్రూపుల ద్వారా రుణాలు అందించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. త్వరలో మండలంలోని కౌలు రైతులందరికీ ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాల ప్రక్రియ వేగవంతం చేసి లబ్ధి చేకూరుస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకులకు కౌలు రైతుల పంట రుణాల ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు.

కొవ్వొత్తులతో నిరసన



పెదకూరపాడు: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై మండల పరిధిలోని పాడపాడు గ్రామంలో పలువురు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అత్యాచారం, హత్యకు పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేసి వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఆదివారం రాత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్య సమాజం సిగ్గుపడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

నరసరావుపేట టౌన్: ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి బయలుదేరిన భార్య అదృశ్యమైందంటూ భర్త ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు ఫిర్యాదు మేరకు.. భార్య సుధారాణి స్వగ్రామమైన అచ్చంపేటకు వెళ్తానంటే నరసరావుపేట బస్టాండ్‌లో ఇద్దరు కుమార్తెలతోసహా బస్ ఎక్కించాడు. వారు పుట్టింటికి చేరలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ ఆదివారం రాత్రి తెలిపారు.

దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహిళల కోలాటం



మాయల పకీరు నాటకంలోని సన్నివేశం

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నాల్గవ రోజు ప్రథమ పుష్కర ద్వాదశ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకులు, బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పాతూరి వెంకట రమసుబ్బారావులు స్వామి వారి నిత్యారాధన, మంగళశాసనం, వసంతోత్సవం, యాగశాలలో పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మొక్కపాడు బ్రహ్మం మాస్టారు ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి కోలాట భజన మండలి బృందంచే మహిళా కోలాటం నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వహించిన బాలనాగమ్మ జానపద నాటకం చూపరులను ఆకట్టుకుంది. మాయల పకీరు జెట్టి సాంబశివరావు చేసిన నటనకు ప్రేక్షక కళా పోషకులు ముగ్ధులయ్యారు. సోమవారం బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమార్ శర్మచే వేంకటేశ్వర తత్వవైభవంపై ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం భక్త చింతామణి నాటకం కలవని బాలాజీ ట్రస్ట్ చైర్మన్ తెలిపారు.

ఆత్మీయత.. అనురాగానికి ప్రతీక రాఖీ

రాఖీ పండుగంటే సోదరి, సోదరుడి మధ్యన ప్రేమానుబంధానికి ప్రతీక. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు రాఖీ పండుగ జరుపుకుంటారు. ఈ నెల 19న సోమవారం శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ పండుగను జరుపుకోనున్నారు. ఆడపడుచును మహాలక్ష్మి స్వరూపంగా భావించే సంస్కృతి మనది. కష్ట సుఖాల్లో మేమున్నామనే భరోసాను అక్కా చెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. నేడు రక్షాబంధన్ పర్వదిన వేడుక సందర్భంగా సాక్షి కథనం.

- నేడు రక్షా బంధన్ పర్వదిన వేడుకలు
- విభిన్న రాఖీలతో మార్కెట్లు కళకళ
- ఆన్‌లైన్‌లోనూ జోరుగా సాగుతున్న రాఖీల అమ్మకాలు
- బంగారు దుకాణాల్లో అందుబాటులో వెండి రాఖీలు

సత్తెనపల్లి: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనురాగ వేడుక.. రాఖీ పండుగ. ఈ నెల 19న ఘనంగా జరుపుకోనున్నారు. సోదరీసోదరుల మధ్య ఆత్మీయతకు ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుంది. అక్కా చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కట్టగా, సోదరులు బహుమతులు ఇస్తారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందం పంచుకుంటారు. ఈ పండుగను కొన్ని ప్రాంతాల్లో శ్రావణ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు.

రకరకాల రాఖీలు...

వ్యాపారులు రకరకాల రాఖీలు దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. పిల్లలను, పెద్దలను విశేషంగా ఆకట్టుకునే రాఖీలను విక్రయిస్తున్నారు. బంగారు, వెండి, ప్లాస్టిక్ తదితర రాఖీలు ఆకర్షణీయమైన రంగుల్లో ఉన్నాయి. ఒక్కో రాఖీ రూ.10 నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. బంగారం, వెండి అయితే పెద్ద మొత్తంలో ఉంటున్నాయి. గతేడాదితో పోలిస్తే కొత్త డిజైన్లు మార్కెట్లోకి వచ్చాయి.



బ్రో అంటూ కొత్త డిజైన్‌లో రాఖీ

బంగారు పూత, ముత్యాలతో అలంకరించిన రాఖీలు ఆన్‌లైన్‌లో కూడా విక్రయిస్తున్నారు. చిన్నారుల మనసు దోచేలా రాఖీలు కూడా అందుబాటులో ఉన్నాయి. వారం ముందు నుంచే అమ్మకాలు జోరందుకున్నాయి. మార్కెట్లు కళకళలాడుతున్నాయి. గతం కంటే ధరలు పెరిగాయని, గత సంవత్సరం రూ.10కి విక్రయించిన రాఖీ ఇప్పుడు రూ.20కి విక్రస్తున్నారని మహిళలు చెబుతున్నారు.



ఆకట్టుకునే మోడల్స్‌లో రాఖీలు

ఆన్‌లైన్‌లో అనుబంధం...

దూర ప్రాంతాల్లో ఉండే సోదరులకు గతంలో పోస్ట్ ద్వారా రాఖీలు పంపేవారు. ప్రస్తుతం డిజిటల్ నెట్‌వర్క్ పెరిగాక ఆన్‌లైన్ ద్వారా రాఖీలు పంపుతున్నారు. స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్లో సింగిల్ క్లిక్ ద్వారా దేశ విదేశాల్లో సోదరులకు సోదరీమణులు రాఖీలు పంపించే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్లు కూడా ఉన్నాయి. ఇక వివాహం చేసుకొని అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు రాఖీ పండుగకు పుట్టింటికి పయనమవుతున్నారు.

సకాలంలో వర్షాలు.. కళకళలాడుతున్న చేలు



ముత్తాయపాలెం వద్ద ఏపుగా పెరుగుతున్న పత్తి పైరు

అమరావతి : ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు సకాలంలో కురిసిన వర్షాలకు మండలంలోని గ్రామాలలో అన్ని పంటల సాగుకు అనుకూలంగా ఉండటంతో ప్రధానంగా పత్తి పంట ఏపుగా పెరుగుతుండటంతో రైతులలో సంతృప్తి వ్యక్తం అవుతుంది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఎరువులు వేసి పత్తి పంటలో అంతరకృషి చేస్తుండటంతో పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అదనుకు వర్షాలు పడుతుండటంతో పత్తి చేలు నవనవలాడుతున్నాయి. అలాగే మిరప నారు కూడా పెరుగుతుండటంతో నాటు వేయటం కోసం రైతులు పొలాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో అత్యధికంగా వర్షాభావ పంటలు పండిస్తుండటంతో ఇప్పటివరకు అదనుకు వర్షం పడుతుండటంతో రైతులలో హర్షం వ్యక్తమవుతుంది. మండలంలో పత్తి సుమారు 22 వేల ఎకరాలలో సాగు చేయగా, మిర్చి 3000 ఎకరాలలో సాగు చేసే అవకాశం ఉందని, వరి 200 ఎకరాలు, కూరగాయలు, ఇతరాలు 300 ఎకరాలలో సాగు అవుతుందని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులు ఈ ఏడాది దిగుబడులు పెరుగుతాయన్న ఆశతో సాగు చేస్తున్నారు.

వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయండి




పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు, సభ్యులు

అచ్చంపేట: స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2025 జూన్‌లో జరిగే వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల సంఘ సభ్యులు సమావేశమయ్యారు. ఈ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. మహానుభావుడు తుమ్మేపల్లి శ్రీరాములు 5 ఎకరాల విస్తీర్ణంలో 12 సువిశాల గదులు నిర్మించి జిల్లా పరిషత్‌కు అప్పగించారన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులంతా తప్పనిసరిగా వచ్చే జూన్ నెలలో జరిగే వజ్రోత్సవ వేడుకలలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. దీనిపై సెప్టెంబర్ 21వ తేదీన పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులతో సమావేశం జరుగుతుందని, సాధ్యమైనంత మంది పాల్గొని వేడుకల నిర్వహణకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పసుపులేటి పాపిరెడ్డి, కోశాధికారి సూరే సంపత్, కొప్పురావూరి కోటేశ్వరరావు, సూరే కోటిలింగం, గుండా వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అమరావతి: వర్షాకాలం సీజన్‌లో గొర్రెలు, మేకలలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పెంపకం దారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండటం అవసరమని మండల పశు వైద్యాధికారి వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం దారులలో వ్యాధుల పట్ల అవగాహన కొరవడటంతో వారు నష్టపోతున్నారన్నారు. గొర్రెలు, మేకల పెంపకం దారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాటికి వచ్చే కాలిపుండ్లు, నీలినాలుక, పచ్చిక దొమ్మ వంటి వ్యాధులను గమనించాలన్నారు. వీటిలో కాలిపుండ్లు వ్యాధికి టీకాలు ఉన్నాయన్నారు. నీలినాలుక వ్యాధి వైరస్ ద్వారా వ్యాపించటంతో దీనికి టీకాలు లేవని దీని నివారణకు రాత్రిళ్లు వేపాకు పొగ వేయాలని, బ్యుటాక్స్, డెల్టామిత్రిన్ వంటి మందులను గొర్రెలు, మేకలపై స్ప్రే చేయాలన్నారు. పచ్చిక దొమ్మ వ్యాధి తడిసిన మేతను తినటం వల్ల వస్తుందని, దీని నివారణకు మేత ఆరిన తర్వాత మాత్రమే మేపాలన్నారు. మందల పరిసర ప్రాంతాలలో సున్నం, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. బురదగా ఉంటే గొర్రెలను మెరక ప్రాంతాలలో కట్టి వేయాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఈ మూడు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

వైభవంగా శ్రావణమాస బోనాలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ తల్లి



చంద్రాజుపాలెంలో బోనాలను సమర్పిస్తున్న భక్తులు

బెల్లంకొండ: శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం దేవతామూర్తులకు వైభవంగా శ్రావణ మాస బోనాలను భక్తులు సమర్పించారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో గ్రామ దేవత ముత్యాలమ్మకు భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని బుడగజంగాలు అమ్మవారికి బోనాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో పోలేరమ్మ తల్లి జాతరను భక్తులు నిర్వహించారు. భక్తులు జలబిందెలతో ఊరేగింపుగా వెళ్లి దేవతామూర్తులకు జలాభిషేకాలను నిర్వహించారు. పొంగళ్లు చేసి నైవేద్యాలను సమర్పించారు.

ముత్యాలమ్మకు బోనాలు సమర్పణ



ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

రెంటచింతల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై గడుస్తున్నా ప్రతి రోజు ఆకాశం మేఘావృతమై ఉంటున్నా పంటలు సాగు చేసుకునేందుకు సరిపడా వర్షం పడకపోవడంతో మిట్టగుడిపాడుకు చెందిన అన్నదాతలు కురణించవా... వరుణదేవా అంటూ ఆదివారం గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య, శివయ్యల నేతృత్వంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలతో గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహిస్తూ వర్షాలు సకాలంలో కురిసి పైరు పంటలు సమృద్ధిగా పండి రైతన్నల ఇంట సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఇంటికి బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

వడియరాజుల సేవా సంఘం పట్టణ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

నరసరావుపేట: వడియరాజుల సేవా సంఘం పట్టణ అధ్యక్షుడిగా వేముల పాండురంగారావు ఎన్నికయ్యారు. స్థానిక వడియరాజుల కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ వల్లెపు నాగేశ్వరరావు, వేముల శంకర్‌నారాయణ, ఓర్సు గోవిందరావు, మంచాల వెంకట్రావు, వేముల శివ హాజరయ్యారు. వీరి సమక్షంలో గౌరవ అధ్యక్షులుగా వల్లెపు కృపారావు, ప్రధాన కార్యదర్శిగా వల్లెపు లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా బత్తుల సెల్వరాజు, వేముల శ్రీనివాసరావు, గుంజి ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా కుంచాల శ్రీను, బండారు శివనాగేశ్వరరావు, కుంచాల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కుంచాల రవికుమార్, కార్యవర్గ సభ్యునిగా గుంజి రవికుమార్, మహిళా అధ్యక్షురాలిగా అచ్చి వీరమ్మ ఎన్నికయ్యారు. త్వరలో సంఘం ప్రమాణస్వీకారం జరుగుతుందని పాండురంగారావు తెలిపారు.

ఘనంగా శాంతి హోమాలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న రెడ్డిపేరంటాలమ్మతల్లి ఆలయం పైకప్పు పనులు ఆదివారంతో ముగిశాయి. ఆలయం వద్ద శాంతి హోమాలు ఒంగోలుకు చెందిన సనాతన శంకర పీఠాధిపతి నరసయ్య చార్యస్వామి, వేద పండితుల ఆధ్వర్యంలో జరిగాయి. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.